క్లుప్తంగా

అన్నదాన ట్రస్టుకు విరాళం



దాతకు స్వామి వారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ సిబ్బంది

ఐ.పోలవరం: నిత్య కళ్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురముళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి వారి ఆలయంలో అన్నదాన ట్రస్టుకు ఓ భక్తురాలు విరాళం అందించారు. యానాంకు చెందిన కర్రి ప్రియ రూ.10వేలను ఆలయ పర్యవేక్షణాధికారి కె.శ్రీనివాసరావుకు సోమవారం అందించారు. ఈ సందర్భంగా దాతను ఆలయ మర్యాదలతో స్వామివారి చిత్రపటం, శేష వస్త్రం, ప్రసాదాన్ని అందించి సత్కరించారు.

లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కమిషనర్ రాజేష్ బదిలీ

అమలాపురం టౌన్: అమలాపురం లీగల్ మెట్రాలజీ (వెయిట్ అండ్ మెజర్‌మెంట్స్) అసిస్టెంట్ కమిషనర్ రాజేష్ బదిలీ అయ్యారు. ఇక్కడ నుంచి అనకాపల్లి జిల్లాకు ఆయన బదిలీ అయ్యారు. ఆయనను అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్, బులియన్ అసోసియేషన్‌ల ప్రతినిధులు సోమవారం స్థానిక లీగల్ మెట్రాలజీ కార్యాయానికి వెళ్లి సత్కరించి వీడ్కోలు పలికారు. చాంబర్ అధ్యక్షుడు బోణం సత్య వర ప్రసాద్, కార్యదర్శి కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, ముఖ్య సలహాదారు కంచిపల్లి అబ్బులు, బులియన్ అసోసియేషన్ (గోల్డ్ మార్కెట్) అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, వ్యాపార సంఘాల ప్రతినిధులు చింతలపూడి సత్తిబాబు, కొవ్వూరి వెంకటరెడ్డి ఆయనను సత్కరించారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ముమ్మిడివరం : ముమ్మిడివరం బస్టాండ్ సెంటర్లో శ్రీసద్గురు సాయిబాబా ఆలయ 14వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద వేద పండితులు పలువురు దంపతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి బాబా తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పంటబోదె ఆక్రమణపై ఫిర్యాదు

మలికిపురం: మండలంలోని గూడపల్లి పల్లిపాలెంలో పంట బోదె ఆక్రమణపై గ్రామస్తులు కాపిశెట్టి కనికేశ్వరరావు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తూరలు పెట్టి ఆక్రమణకు పాల్పడడం వల్ల పంట నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

అంబాజీపేట: పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని వైద్యాధికారి టి.దివ్యశ్రీ అన్నారు. ముక్కామల పీహెచ్‌సీ వద్ద గర్భిణులకు పౌష్టికాహారాన్ని, మందులను సోమవారం పంపిణీ చేశారు. డాక్టర్ దివ్యశ్రీ మాట్లాడుతూ గర్భిణులు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అంతకుముందు గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. రావులపాలెంకు చెందిన ఎంపి వెంకటరెడ్డి సహకారంతో గర్భిణులకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియాను అంతం చేద్దాం



కలవచర్లలో వైద్యారోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న మలేరియా మాసోత్సవాల ర్యాలీ

ఆలమూరు: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా మలేరియాను అంతం చేద్దామని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల వైద్యాధికారులు ఎస్.లక్ష్మీస్నేహ, బి.అనంతరామకృష్ణ, డి.సాయికిషోర్ కోరారు. మలేరియా నివారణ మాసోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని కలవచర్ల, మూలస్థాన అగ్రహారం గ్రామాల్లో సోమవారం వైద్యారోగ్య సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. మలేరియా అంతం మనతోనే అంటూ నినాదాలు చేశారు. ఆడ అనాఫిలిస్ దోమ నుంచి వ్యాప్తి చెందే ఈ వ్యాధి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మలేరియా నివారణకు దోమల నిర్మూలనే సరైన మార్గమని తెలియజేశారు. దీనిపై ఈనెల రోజుల పాటు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, బి,సూర్యనారాయణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

వేతనాలకు ఎదురుచూపులు

- ఉపాధి కూలీలకు రెండు నెలలుగా అందని వైనం
- రూ.3 కోట్ల 88 లక్షల బకాయిలు



గోడిలోని పంచాయతీ చెరువులో పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

అల్లవరం: రెక్కాడితే గాని డొక్క నిండని పరిస్థితి ఉపాధి కూలీలది. ప్రతి రోజూ పని చేసి సమయానుకూలంగా కూలీ డబ్బు చేతికి అందితేనే గుక్కెడు బువ్వ నోటిలోకి వెళ్లేది. రూరల్ ఏరియాలో నిరుపేదలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కడుపు నింపని పరిస్థితి కనిపిస్తోంది. ఉపాధి లభిస్తున్నా నిర్ణీత సమయానికి వేతనాలు విడుదల కాక ఉపాధి కూలీలు ఎదురుచూస్తున్నారు. అల్లవరం మండలంలో 11 వేల కుటుంబాలు ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి పొందుతున్నాయి. వీరి ఉపాధికి ఏటా వంద రోజుల పాటు పనిని కల్పించి, నిర్ణీత గడువులోగా వేతనాలు చెల్లించవలసి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం ఆరంభం నుంచి కాలువల్లో పూడిక తీత పనులు, పంట బోదెలు పూడిక తీత పనులు, ఫారమ్ పాండ్స్ తవ్వకాలు, కొబ్బరి చెట్లకు కందకాల తవ్వకాలు వంటి పనులు నిర్వహించారు. ఏప్రిల్ నుంచి మే 31 వరకు అల్లవరం మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో 1,012 పనుల ద్వారా 1,29,519 పని దినాలు కల్పించారు. ఏప్రిల్ నుంచి మే 31 వరకు 61 రోజులకు వేతనాల్లో రూ.3 కోట్ల 88 లక్షల 55 వేల 700 వేతనాల పెండింగ్ ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఒక్క రూపాయి కుడా కూలీలకు చెల్లించలేదు. జూన్‌లో పది రోజులు గడచినా వేతనాల ఊసే కూటమి ప్రభుత్వానికి లేదు. ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి. కూలీల వేతనాలు ఎప్పుడు రిలీజ్ అవుతాయో ఉపాధి హామీ అధికారులు చెప్పలేకపోతున్నారు. కేంద్రం నుంచి రావల్సిన నిధులు రాష్ట్రానికి చేరాయని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉపాధి నిధులు ఎప్పుడు విడుదల అవుతాయో మాకు తెలియదంటున్నారు. కేంద్రం నుంచి విడుదల చేసిన ఉపాధి నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకుండా తాత్సారం చేస్తోందని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం విఫలం

గత ఏడాది కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉపాధి కూలీల వేతనాలను నిర్ణీత సమయానికి చెల్లించడంలో విఫలమైంది. ఈ ఏడాది కూడా గత ఏడాది మాదిరిగానే ఉపాధి కూలీల వేతనాలను ఆలస్యం చేసింది. రెండు, మూడు నెలలు పాటు వేతనాలు ఇవ్వకపోతే మా జీవితాలు ఎలా ముందుకు సాగేదని ఉపాధి కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు. దీనిపై ఉపాధి ఏపీఓ రాజామణిని వివరణ కోరగా నిధులు విడుదల కావల్సి ఉందన్నారు. నిధులు విడుదలైతే వేతనాలు వారి బ్యాంక్ ఖాతాలకు జమ అవుతాయని తెలిపారు.

8 వారాలుగా వేతనాలు లేవు



ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు ఎనిమిది వారాలు పాటు పని చేశాం. ఈ రెండు నెలల కాలంలో ఒక్క రూపాయి కూడా కూలీ డబ్బు ఇవ్వలేదు. ఎనిమిది వారాలకు సుమారు రూ.14 వేల వరకు కూలీ డబ్బు రావల్సి ఉంది. అధికారులను అడుగుతుంటే త్వరలో రిలీజ్ అవుతాయని చెబుతున్నారు. ఉపాధి కూలీలందరూ డబ్బు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– పెచ్చెట్టి వెంకటలక్ష్మి, ఉపాధి కూలీ, దేవగుప్తం

ఉపాధి వేతనాలు చెల్లించాలి



ఉపాధి హామీ పథకంలో పనులు నిర్వహించి రెండు నెలలు కావస్తున్నా నేటికీ వేతనాలు ఇవ్వలేదు. ఉపాధి పథకంపై ఆధారపడుతున్న నిరుపేద కుటుంబాలకు వేతనాలు జమ కాక ఆర్థిక భారంగా ఉంది. అధికారులు స్పందించి వెంటనే ఉపాధి వేతనాలు విడుదల చేయాలి.

– బొంతు శృతి, ఉపాధి కూలీ, రెల్లుగడ్డ

వెంకన్న హుండీల ఆదాయం రూ.15.75 లక్షలు



హుండీలకు హారతి ఇస్తున్న అర్చకుడు, ఈవో వెంకటేశ్వరావు తదితరులు

అమలాపురం టౌన్: అమలాపురం వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో హుండీలను సోమవారం తెరచి లెక్కించారు. రెండు నెలల పన్నెండు రోజులకు రూ.15.75 లక్షల ఆదాయం వచ్చిందని ఈవో యర్రా వెంకటేశ్వరరావు తెలిపారు. ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి గ్రూపు దేవాలయాల ఈవో కేఎస్‌వీ దుర్గ పర్యవేక్షణలో హుండీల లెక్కింపు జరిగింది. భక్తులు, వివిధ ధార్మిక సంఘాల ప్రతినిధుల సమక్షంలో హుండీలను లెక్కించారు.

ప్రసన్నాంజనేయస్వామి నగరోత్సవం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసిన ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ప్రసన్నాంజనేయ బాలభక్త కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామనామ సప్త సప్తాహంలో భాగంగా మొదటి సప్తాహం(వారం రోజులు) పూర్తయిన సందర్భంగా విద్యుత్ దీపాలంకరణ చేసిన ఉష్ట్ర వాహనంపై స్వామివారి నగరోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ద్రాక్షారామ, వెలంపాలెం గ్రామ వీధుల్లో మేళతాళాలతో ఊరేగింపు చేశారు.

ముగిసిన వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం



వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా పతకాలు, ధ్రువీకరణ పత్రాలతో విద్యార్థులు, కోచ్‌లు

అమలాపురం టౌన్: నెల రోజులుగా అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో జరుగుతున్న వేసవి షటిల్ బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం ఆదివారం రాత్రితో ముగిసింది. క్రీడాశిక్షణ పొందిన విద్యార్థులకు చివరిరోజు టోర్నమెంట్ నిర్వహించి బహుమతులు, పతకాలు, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పట్టణానికి చెందిన రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ తండ్రి విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ దివంగత కాశీ విశ్వనాథ్ పేరు మీద స్పోర్ట్స్ కాశీ బ్యాడ్మింటన్ అకాడమిని ముఖ్య అతిథులు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, జిల్లా కార్యదర్శి యాళ్ల సతీష్, ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ కార్యదర్శి తిక్కిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. జిల్లా ఒలింపిక్, క్రీడా భారతి అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం జరిగింది.

ముగిసిన వేసవి విజ్ఞాన తరగతులు



విద్యార్థికి బహుమతిని అందిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు ప్రకాశరావు



భీమనపల్లి గ్రంథాలయ శాఖలో ధ్రువీకరణ పత్రాలను చూపుతున్న విద్యార్థులు

అల్లవరం: అల్లవరం గ్రంథాలయంలో జూన్ 6 నుంచి 9 వరకు జరిగిన వేసవి విజ్ఞాన తరగతులు సోమవారంతో ముగిసాయని గ్రంథాలయాధికారి వి.ద్వారాకమణి సోమవారం తెలిపారు. మూడు రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు కథలు చెప్పడం, దేశభక్తి గీతాలు ఆలపించడం, ఇంగ్లిష్ గ్రామర్‌పై అవగాహన పెంచుకోవడం, చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్, యోగా తదితర విషయాలపై అవగాహన కల్పించామన్నారు. వేసవి విజ్ఞాన తరగతులు సందర్భంగా ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయులు ఏజీఎస్ ప్రకాశరావు చేతుల మీదుగా బహుమతులు అందించామని ఆమె తెలిపారు.

ఉప్పలగుప్తం

మండలంలోని ఉప్పలగుప్తం, భీమనపల్లి శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన తరగతులు సోమవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారులు సలాది నాగేశ్వరరావు, నిమ్మకాయల శేషుబాబుల ఆధ్వర్యంలో గ్రంథాలయాల్లో ముగింపు సభలను ఏర్పాటు చేశారు. ఈ సభకు సర్పంచ్‌లు పెయ్యిల రాజ్‌కుమార్, కడిమి చిన్నవరాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం వేసవి విజ్ఞాన తరగతుల్లో ఆయా విభాగాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఎంపీటీసీ సభ్యురాలు దేశంశెట్టి రత్నకుమారి, ఎంఈవో సత్తి సత్యకృష్ణ, విశ్రాంత ఉద్యోగి అద్దంకి అమరేశ్వరరావు, నల్లా నరసింహమూర్తి, చిక్కం సాంబశివరావు, కంకటాల రామం, చిక్కం వెంకట సత్యప్రసాద్, సలాది పుల్లయ్యనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కొత్తపేట: స్థానిక బొరుసువారి సావరం విజయకనకదుర్గాదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం, దుర్గామల్లేశ్వర స్వామివార్ల దివ్య తిరు కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు సోమవారం వైభవంగా ప్రారంభించారు. ఆలయ పునర్నిర్మాణకర్త, ఆలయ పోషకుడు బొరుసు వెంకట ఉదయభాస్కర్–వసుధ దంపతుల ఆధ్వర్యంలో వివిధ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ పసుపులేటి శ్రీనివాస్–సత్య దంపతులు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. ఇంకా రెండు రోజులు పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం జరిగే సామూహిక కళ్యాణంలో పాల్గొనే భక్తులు ఆలయ కమిటీని, లేదా ఆలయ అర్చకులను సంప్రదించాలని కమిటీ సభ్యులు కోరారు.

ఘనంగా శివాజీ పట్టాభిషేక దినోత్సవం

కొత్తపేట: ఛత్రపతి శివాజీ పట్టాభిషేక దినోత్సవాన్ని మండలంలోని వాడపాలెంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ మండల శాఖ మాజీ అధ్యక్షుడు పాలాటి మాధవస్వామి ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద శివాజీ విగ్రహానికి పాలూరి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సత్యానందం మాట్లాడుతూ శివాజీ పట్టాభిషేకం జరిగిన సందర్భాన్ని పురస్కరించుకుని హిందూ సామ్రాజ్య దివస్ జరుపుకొంటున్నామన్నారు. కార్యక్రమంలో తొగరు ఆంజనేయులు, పెదపూడి బాపిరాజు, సంపతి కనకేశ్వరరావు, వరగన వరబాబు తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో పడి యువకుడి మృతి

మామిడికుదురు: పెదపట్నం గ్రామానికి చెందిన మోటుపల్లి స్వామినాయుడు (36) సోమవారం బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ అదే గ్రామంలోని గోదావరి నదిలో పడి మృతి చెందాడు. గోదావరి నదిలో పడి గల్లంతైన అతడి కోసం నదిలో గాలించగా మృతదేహం లభ్యమైంది. దీనిపై నగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హైదరాబాద్‌లో టైలరింగ్ చేస్తూ జీవనం సాగించే మృతుడు శనివారం స్వగ్రామం వచ్చాడన్నారు. వేసవి సెలవులకు కొడుకు, కూతురును స్వగ్రామంలో దింపి వెళ్లాడని వేసవి సెలవులు ముగుస్తుండడంతో మంగళవారం పిల్లల్ని హైదరాబాద్ తీసుకు వెళ్లాల్సి ఉందని స్వామినాయుడు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంతలోనే అతను మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

విద్యుత్ షాక్‌తో..

కొత్తపేట: మండలంలోని పలివెల–ఖండ్రిగ ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఆగి ఉన్న కంటైనర్ లారీకి విద్యుత్ లైన్ వైర్లు తగిలి ఆ లారీ డ్రైవర్ మృతి చెందినట్టు ఎస్సై జి.సురేంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రం శరన్ జిల్లా పచోటికార్ గ్రామానికి చెందిన కమల్ కిషోర్ షా అనే లారీ డ్రైవర్ తన కంటైనర్ లారీని పలివెల నుంచి ఖండ్రిగ పోవు రోడ్డులో పార్కింగ్ చేయగా పై నుంచి వెళ్లిన విద్యుత్ లైన్ వైర్లు తగిలి డ్రైవర్ కిషోర్ షా మృతి చెందాడు. పలివెల వీఆర్ఓ కె.నరసింహమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై సురేంద్ర సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పీఎం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఆరోగ్యవంతమైన జీవితానికి యోగా అవసరం



ముమ్మిడివరంలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న నగర పంచాయతీ కార్యాలయ సిబ్బంది

ముమ్మిడివరం: ఆరోగ్యవంతమైన జీవితానికి యోగా ఎంతో అవసరమని నగర పంచాయతీ ఇన్‌చార్జి కమిషనర్ పీవీ సుధాకర్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా సోమవారం నగర పంచాయతీ కార్యాలయ సిబ్బంది యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. నగర పంచాయతీ కార్యాలయం నుంచి టీటీఆర్ కల్యాణ మండపం వరకు ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. కమిషనర్ పీవీ సుధాకర్ మాట్లాడుతూ యోగా ప్రాముఖ్యతను వివరించారు. ఇన్‌చార్జి కమిషనర్ పీవీ సుధాకర్, మేనేజర్ పీవీ నూకరాజు, టీపీఓ బి.రాజేష్‌బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జె.సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. సీహెచ్ గున్నేపల్లిలో సర్పంచ్ గొలకోటి దొరబాబు ఆధ్వర్యంలో యోగా ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ఇందుమతి కృష్ణవేణి, యాళ్ల ఉదయ్, గొలకోటి తాతాజీ, సఖిలే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

తాళ్లరేవు: ప్రతి ఒక్కరూ యోగ చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు, సుంకరపాలెం సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం మండలంలోని అన్ని పంచాయతీలలో యోగాంధ్ర కార్యక్రమంపై అవగాహన నిర్వహించి అనంతరం ర్యాలీలు చేశారు. మండల కేంద్రమైన తాళ్లరేవులో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో కె.సత్యనారాయణ పాల్గొని అవగాహన కల్పించారు. ప్రతిరోజూ కొంత సమయాన్ని యోగాకి కేటాయించి ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమాలలో పంపన రామకృష్ణ, రెడ్డి రెడ్డిబాబు, గుత్తుల శ్రీను, వెల్ఫేర్ ఆఫీసర్స్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

‘ఉక్కు’ కాంట్రాక్టు ఉద్యోగులను తిరిగి తీసుకోవాలి



ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నేతలు

అమలాపురం టౌన్: విశాఖ ఉక్కు పరిశ్రమలో తొలగించిన 4,500 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి చేర్చుకోవాలని పలు కార్మిక సంఘాల డిమాండ్ చేశాయి. ఈ డిమాండుతో సీఐటీయూ, ఏఐటీయూసీ తదితర సంఘాల ఆధ్వర్యాన సోమవారం సాయంత్రం స్థానిక గడియారం స్తంభం సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, ఏఐటీయూసీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కె.సత్తిబాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ప్రయత్నాలు మరింత వేగవంతమయ్యాయని ధ్వజమెత్తారు. ఇందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో 4,500 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించారని అన్నారు. ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించకుండా నష్టాలకు ఉద్యోగులనే బాధ్యులని కూటమి ఎమ్మెల్యేలు మాట్లాడడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. నాడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లు విశాఖ ఉక్కు ఉద్యమానికి సంఘీభావం తెలిపారని, ఇప్పుడు అధికారం చేపట్టాక విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు మద్దతు తెలుపుతున్నారని ఆరోపించారు. నాడు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి నిధులు తెస్తామని, కార్మికులను తొలగిస్తే ఒప్పుకోబోమని చెప్పిన వారే నేడు నోరు మెదపడం లేదని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఓ మాట, అధికారం చేపట్టాక మరో మాట చెబుతున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ధర్నాలో వివిధ కార్మిక సంఘాల నాయకులు పి.అమూల్య, దైవకృప, రత్నకుమారి, పార్వతి, నిమ్మకాయల శ్రీనివాస్, సతీష్, జనార్దనరావు, రామారావు, ప్రసాద్, ఉమ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న గ్రామ పంచాయతీ కాంట్రాక్ట్ ఉద్యోగులు

కలెక్టరేట్ వద్ద నిరసన

అమలాపురంరూరల్: జిల్లాలో గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పంచాయతీ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. కనీస వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆందోళన చేశారు. 30 ఏళ్లుగా ట్యాంక్, రెవెన్యూ వాచర్, గేట్ వాల్ ఆపరేటర్, వాచ్‌మెన్ ఎలక్ట్రీషియన్ తదితర విభాగాల్లో పని చేస్తున్నామన్నారు. చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న తమను ప్రభుత్వకు జీతాలు పెంచాలని జిల్లా అధ్యక్షుడు జార్జి డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ జనరల్ ఫండ్ నుంచి చాలీచాలని జీతాలు తీసుకొంటూ విధులు నిర్వహిస్తున్నామన్నారు.

వివక్షపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు



సఖినేటిపల్లి గ్రీవెన్స్‌లో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న దళిత సంఘాల నేతలు

సఖినేటిపల్లి: అంతర్వేదికరలోని కొత్తపేట కాలనీలో నివసిస్తున్న ఎస్సీ సామాజిక వర్గంపై కొనసాగుతున్న వివక్షతపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో దళిత సంఘ నేతలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావును కలసి పై ఫిర్యాదును నియోజకవర్గ దళిత సంఘాల జేఏసీ నాయకులు ఇచ్చారు. కొత్తపేటలో దళితులు నడిచే రహదారిలో నెలకొని ఉన్న అవరోధాలపై న్యాయ విచారణ జరిపించాలని వారు విజ్ఞప్తి చేశారు. కాగా కొత్తపేటలో నెలకొని ఉన్న సమస్యలపై విజయవాడలోని రాష్ట్ర ఎస్సీ కమీషన్‌కు, ఢిల్లీలోని జాతీయ ఎస్సీ కమీషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు దళిత నాయకులు పేర్కొన్నారు. జేఏసీ అధ్యక్షుడు చింతా రాజబాబు, దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో కవితల పోటీలు

సఖినేటిపల్లి: పర్యావరణానికి పెనుముప్పుగా మారిన ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో కవితల పోటీలు నిర్వహిస్తున్నట్టు వేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. సోమవారం సఖినేటిపల్లిలో ఆయన మాట్లాడుతూ, కవితలు శ్రీశ్రీ కళావేదిక వాట్సాప్ గ్రూపుల్లో రాయాలని కవులను కోరారు. నిరంతరం సాహిత్య క్రతువులో భాగంగా కవులందరినీ ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో పర్యావరణంపై ప్లాస్టిక్ భూతం అనే అంశంపై నగదు బహుమతి కవితల పోటీలు ఈ మేరకు ఏర్పాటు చేశామన్నారు. కవితల పోటీల్లో విజేతలైన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులు కింద రూ.2 వేలు, రూ.1,500, రూ.1,000, రూ.600లతో పాటు పది మందికి ఒక్కొక్కరికీ రూ.500 చొప్పున కన్సొలేషన్ బహుమతులు ఇస్తామని అన్నారు. కాగా ఈ నెల 22న కాకినాడ పీఆర్ కళాశాల ఆవరణలో జరిగే వేదిక ద్విశతక కవి సమ్మేళనంలో పై బహుమతులు అందజేయనున్నట్టు ప్రతాప్ పేర్కొన్నారు.

పీఎంఎంఎస్ఏతో మాతృ, శిశు మరణాల నివారణ

ఆలమూరు: మాతృత్వ, శిశు మరణాల నివారణకు, చిన్నారుల మెరుగైన ఆరోగ్య సంరక్షణను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ (పీఎంఎంఎస్ఏ) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.లక్ష్మీస్నేహ, డి.సాయి కిషోర్ అన్నారు. పీఎంఎంఎస్ఏ పథకంలో భాగంగా ఆయా పీహెచ్‌సీల్లో సోమవారం నిర్వహించిన పీఎంఎంఎస్ఏ లో సుమారు 132 మంది బాలింతలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.